

నేడు పీజీఆర్ఎస్

పార్వతీపురం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని కార్యాలయాల్లో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిరోజూ ప్రజల నుంచి వినతులు స్వీకరించడానికి కలెక్టరేట్‌లో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే, మీకోసం.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లోనూ అర్జీలు నమోదు చేసుకోవచ్చునన్నారు. అర్జీల నమోదు, వాటి స్థితిని తెలుసుకోవడానికి టోల్‌ఫ్రీ నెంబర్ 1100కు ఫోన్ చేయవచ్చునని తెలిపారు.





- పశువైద్యం.. దైన్యం
- భర్తీకాని వైద్యాధికారుల పోస్టులు
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- శిథిలావస్థలో భవనాలు
- సకాలంలో మూగజీవాలకు అందని సేవలు
- ఇబ్బందుల్లో గిరిజన రైతులు

ఏజెన్సీలో మూగ వేదన!

సీతంపేటలోని వెటర్నరీ డిస్పెన్సరీ కేంద్రం





సీతంపేట వెటర్నరీ కేంద్రంలో కంప్యూటర్ ఆపరేటర్ లేక ఖాళీగా ఉన్న కుర్చీ

సీతంపేట రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతాల్లో పశుసంవర్థక శాఖను సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. వసతి సమస్య కూడా వెంటాడుతుంది. ప్రధానంగా గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో పోస్టుల భర్తీకి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో గిరిజన ప్రాంతాల్లో మూగ జీవాలకు ఆశించిన స్థాయిలో సేవలు అందడం లేదు. మరోవైపు ఏటా సీజనల్ వ్యాధులకు గురై పాడి పశువులు, మేకలు, గొర్రెలు మృత్యువాత పడుతున్నాయి. దీంతో గిరిజన రైతులు తలలు పట్టుకుంటున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలోని 15 మండలాల్లో 38 మంది పశు వైద్యాధికారులు ఉండాలి. అయితే 18మంది మాత్రమే ఉన్నారు. మిగిలిన 20 పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. వెటర్నరీ ఏడీ పోస్టులు ఏడు ఉండగా.. గరుగుబిల్లి మండలంలో పోస్టును ఇంత వరకు భర్తీ చేయలేదు. అంతేకాకుండా క్షేత్రస్థాయి సిబ్బంది కొరత కూడా వేధిస్తోంది. సీతంపేటలోని వెటర్నరీ డిస్పెన్సరీ కార్యాలయంలో డాటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టును గడిచిన ఏడేళ్ల కిందట పొరుగుసేవల ప్రాతిపదికన భర్తీ చేశారు. అయితే ఇక్కడ డీఈవోగా(డాటా ఎంట్రీ ఆపరేటర్)పనిచేయాల్సిన సిబ్బందిని శ్రీకాకుళం డిప్యుటేషన్‌పై వేశారు. దీంతో ఇక్కడ కంప్యూటర్ రికార్డు వర్క్ ముందుకు సాగడం లేదు.

- ఏడీ కార్యాలయంలో డీఈవో లేకపోవడంతో ఏడీ శ్రీనివాసరావు కార్యాలయంలో కంప్యూటర్ వర్క్ చేసుకుంటున్నారు. ఇదేంటని అడిగితే సదరు ఆపరేటర్ జీతం ఇక్కడ తీసుకొని సేవలు శ్రీకాకుళం అందిస్తున్నట్లు చెప్పారు.
- సీతంపేట ప్రాంతీయ పశువైద్యశాల పరిధిలో ఉన్న సీతంపేట, భామిని మండలాల్లో ఐదుగురు పశు వైద్యాధికారులు ఉండాలి. కానీ సీతంపేట మండలంలో ఇద్దరు పశు వైద్యులు సేవలందిస్తున్నారు.
- ఒక్కో పశు వైద్యాధికారి రెండు లేక మూడు పశు వైద్యశాలలను చూస్తుండడంతో గ్రామస్థాయిలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
- సీతంపేట, పొల్ల, చినబగ్గ, దోనుబాయి, భామిని, బత్తిలిలో ఆఫీస్ సబార్డినేటర్‌తో పాటు అటెండర్ పోస్టులను కూడా భర్తీ చేయాల్సి ఉంది.
- ఈ వర్షాకాల సీజన్‌లో గొర్రెలు, మేకలు, లేగదూడలకు వింత వ్యాధులు సంక్రమిస్తాయి. అయితే (మిగతా 8వ పేజీలో..)

గిజబలో ఏనుగుల తిష్ఠ

గరుగుబిల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిజబ గ్రామ సమీపంలో ఏనుగులు తిష్ఠవేశాయి. గత రెండు రోజులుగా గ్రామ పరిసర ప్రాంతాల్లోనే సంచరిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామానికి ఆనుకుని తోటపల్లి ప్రాజెక్టుతో పాటు పామాయిల్, అరటి, పలు రకాల పండ్ల తోటలు ఉండడం గజరాజులకు కలిసివచ్చింది. దీంతో ఆ ప్రాంతం నుంచి అవి కదలడం లేదు. ముమ్మరంగా వ్యవసాయ పనులు జరుగుతున్న సమయంలో ఏనుగులు సంచరిస్తుండడంతో పనులకు ఆటంకం కలుగుతుందని రైతులు వాపోతున్నారు. గ్రామాల వైపు ఏనుగులు వెళ్లకుండా అటవీ సిబ్బంది, ట్రాకర్లు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. ప్రజలు ఎటువంటి కవ్వింపు చర్యలకు పాల్పడరాదని హెచ్చరిస్తున్నారు. వ్యవసాయ పనుల దృష్ట్యా ఏనుగులను సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



గిజబ పొలాల్లో సంచరిస్తున్న ఏనుగులు

కొడుకుతో వెళుతూ.. కానరాని లోకాలకు

- గుర్తుతెలియని వాహనం ఢీకొని తండ్రి మృతి

7లో

అక్విడక్టులు ఇలా.. సాగునీరు ఎలా?



ఉల్లిభద్ర సమీపంలో తోటపల్లి కుడి ప్రధాన కాలువపై శిథిలావస్థలో ఉన్న అక్విడక్టు

- పిచ్చిమొక్కలతో నిండిపోయిన దోనెలు
- శిథిలావస్థకు చేరడంతో లీకవుతున్న నీరు
- దృష్టి సారించని యంత్రాంగం



దోనిలో వర్షపు నీరు నిల్వతో శిథిలావస్థకు చేరుకున్న అక్విడక్టు

గరుగుబిల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉల్లిభద్ర వద్ద తోటపల్లి కుడి ప్రధాన కాలువపై ఉన్న అక్విడక్టులు శిథిలావస్థకు చేరాయి. దీంతో అక్విడక్టుల నుంచి రెండు వైపులా నీరు లీకవుతుంది. చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో అక్విడక్టులు కనిపించడం లేదు. జంఝావతి ప్రాజెక్టు నుంచి గరుగుబిల్లి మండలానికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో పదేళ్ల కిందట టీడీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.40లక్షల వ్యయంతో వివిధ ప్రాంతాల్లో అక్విడక్టులు, కాలువలు నిర్మించారు. ఇందులో భాగంగా ఉల్లిభద్ర వద్ద తోటపల్లి కుడి ప్రధాన కాలువపై రెండు అక్విడక్టులను ఏర్పాటు చేశారు. ఒక అక్విడెక్టు ద్వారా ఉల్లిభద్ర, దళాయివలస, తులసిరామినాయుడువలస, మరో అక్విడక్టు ద్వారా కొంకడివరం, సీతారాంపురం, శివరాంపురంతో పాటు పలు గ్రామాలకు సంబంధించి సుమారు 5 వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. అయితే, ప్రస్తుతం అక్విడక్టులు, కాలువలు అత్యంత దయనీయంగా తయారయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వీటిపై అధికారులు అంతగా దృష్టి సారించలేదు. దీంతో అక్విడక్టుల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయి. అలాగే, దోనెల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. ఫలితంగా రెండు వైపులా సాగునీరు లీకు అవుతుంది. కాలువలో ఏడు కిలో మీటర్ల మేర పిచ్చి మొక్కలు, పూడికలు తొలగించారు. ఇంకా 35 కిలో మీటర్ల మేర గుర్రపు డెక్క, పిచ్చి మొక్కలు (మిగతా 8వ పేజీలో..)



పిచ్చి మొక్కలు పేరుకుపోవడంతో కనిపించని అక్విడక్టు

ప్రగతి లేని పైలెట్ గ్రామాలు

- అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- అధికారుల నిర్లక్ష్యం

7లో

కూటమితో సుపరిపాలన సాధ్యం

- మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

8లో

శిథిలావస్థలో సంధి గెడ్డ చెక్‌డ్యామ్

8లో



సీజన్ ముగుస్తున్నా ధర పెరగలే

- పది రూపాయలే పలుకుతున్న పైనాపిల్
- నిరాశలో గిరిజనులు

సీతంపేట రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి):సీతంపేట ఏజెన్సీలో పైనాపిల్ సీజన్ ఈవారంతో ముగియనుంది. ఇకపై ఆశించిన స్థాయిలో పైనాపిల్ పంట దిగుబడి ఉండదు. అయితే, సీజన్ ముగుస్తున్నప్పటికీ పైనాపిల్ పంటకు సరైన మద్దతు ధర లభించడం లేదు. గత వారం ఒక్కో పైనాపిల్ పండు ధర రూ.10వరకు పలికింది. ఈ వారం కూడా ధరలో ఎటువంటి మార్పు లేకపోవడంతో గిరిజన రైతులు తీవ్ర నిరాశ చెందారు. ఆదివారం సీతంపేట వారపుసంతకు పైనాపిల్ పంట ఎక్కువగానే వచ్చినప్పటికీ ధరలో మాత్రం ఎటువంటి మార్పులు కనబడలేదు. దీంతో గిరిజన రైతులు లబోదిబోమంటున్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది పైనాపిల్ పంటకు గిట్టుబాటు ధర రాక నష్టపోయామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సీతంపేట వారపుసంతలో గుట్టలుగా పోసిన పైనాపిల్ పండ్లు

కష్టపడి తడుపుతున్నారు..

- వర్షాలు లేక ఎండిపోతున్న వరి నారు
- కాపాడుకునేందుకు రైతులు పాట్లు
- డ్రమ్ములతో నీటిని తెచ్చి తడుపుతున్న వైనం

మక్కువ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఒకపక్క వర్షాలు కురవడం లేదు.. మరోపక్క జలశయాల నుంచి సాగునీరు విడుదల కావడం లేదు.. ఇంకొకపక్క వేసవిని తలపించేలా ఎండలు వెరసి అన్నదాతలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మక్కువ మండలంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా చాలా గ్రామాల్లో వరి నారు ఎండిపోతుంది. దీంతో వరి నారును కాపాడుకునేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు. టైరు బండ్లపై సుదూర ప్రాంతాలకు వెళ్లి బావుల్లోని నీటిని డ్రమ్ముల్లో నింపి తీసుకువచ్చి నారును తడుపుతున్నారు.



నారుపై నీరు పోస్తున్న రైతు



మక్కువలో డ్రమ్ములతో నీరు తెచ్చిన రైతులు

వెంగళరాయసాగర్ నుంచి సాగునీరు విడుదలైనా ఈ కష్టాలు తప్పేవి. కానీ, ఇంతవరకు కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా చుక్క నీరు కూడా రావడం లేదు. దీంతో ఎండల తీవ్రతకు నారు మడి ఎండిపోకుండా రైతులు నీటిని తీసుకువచ్చి తడుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీఆర్ఎస్ జలాశయం నుంచి సాగునీరు త్వరగా విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

పంటల బీమాతో ప్రయోజనం

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ పంటలకు బీమా చేయించుకోవాలని, దీని వల్ల ఎంతో ప్రయోజనం కలుగుతుందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ఆదివారం వ్యవసాయ శాఖాధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రైతులకు పంటల బీమా పథకాన్ని అమలు చేస్తున్నాయని అన్నారు. బీమాపై రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమాలో చేరడానికి రైతులందరూ అర్హులన్నారు. వరి పంట బీమాకు ఆగస్టు 15లోగా, మొక్కజొన్న, పత్తి, అరటి బీమాకు ఈ నెల31లోగా ప్రీమియం చెల్లించాలన్నారు. వరికి సంబంధించి ఎకరాకు రూ.40 వేలు ప్రీమియం చెల్లించాలన్నారు. ఇందులో రైతులు తమ వాటాగా రూ.800 చెల్లిస్తే సరిపోతుందని, మిగిలిన మొత్తం ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. మొక్కజొన్నకు ఎకరాకు రూ.33 వేలు ప్రీమియం కాగా, రైతు వాటా కింద రూ.330, పత్తికి ఎకరాకు రూ.1923 ప్రీమియం కాగా, రైతు వాటా కింద రూ.98, అరటి పంటకు రూ.3,036 ప్రీమియం కాగా, రైతు వాటా కింద రూ.152 చెల్లించాలని అన్నారు. రైతులు దళారులను, మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని కలెక్టర్ సూచించారు. పంట వేసిన ధ్రువపత్రం జారీ నిమిత్తం కూడా ఎటువంటి మొత్తాన్ని రైతు సేవా కేంద్ర స్పిందికి చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. మరిన్ని వివరాలకు రైతు సేవా కేంద్రం, వ్యవసాయ, ఉద్యానవన కార్యాలయాలను (9951142337, 7065 14447) సంప్రదించాలని సూచించారు.

ఐటీఐలో రెండో విడత ప్రవేశానికి గడువు పొడిగింపు

విజయనగరం దాసన్నపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలలో రెండో విడత ప్రవేశానికి దరఖాస్తులు గడువు పొడిగించినట్లు జిల్లా కన్వీనర్, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ టీవీ గిరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 20తేదీ రాత్రి 11.55 గంటల వరకు దరఖాస్తు చేసుకోవటానికి అవకాశం ఉందని చెప్పారు. రిజిస్ట్రేషన్ పూర్తి అయినవారు 22వ తేదీ ఒంటిగంట లోపు సమీపంలోని ప్రభుత్వ ప్రైవేట్ కళాశాలకు ఒరిజనల్ సర్టిఫికెట్లు తీసుకెళ్లి వెరిఫికేషన్ పూర్తిచేసుకోవాలన్నారు. 23, 25 తేదీల్లో ప్రభుత్వ ఐటీఐలకు, 26, 27 తేదీల్లో ప్రైవేటు ఐటీఐలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వివరాలకు 94415 18355, 98499 44654, 77806 58035 నెంబర్లను సంప్రాదించాలన్నారు.

రేపు పెన్షనర్ల ధర్నా

విజయనగరం రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పెన్షనర్ల సంఘం పిలుపుమేరకు ఈనెల 15న అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నా నిర్వహించనున్నట్టు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పెద్దింటి అప్పారావు, నారాయణ, సూర్యనారాయణ, నాయుడులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వ ఫైనాన్స్ బిల్లుతో పాటు ప్రవేశపెట్టిన ఎమెండ్‌మెంట్ రద్దు చేయాలని, పీఆర్ బకాయిలు తక్షణమే చెల్లించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని చెప్పారు. ఈ ధర్నాకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా ఉరుసు ఉత్సవం

విజయనగరం రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉల్లివీధి కూడలిలో ఉన్న హజరత్ సయ్యద్ న్యామత్ ఖావలీ హౌలియా బాబా ఉరుసు మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. శాంతినగర్ నుంచి చందనోత్సవం ఊరేగింపు నిర్వహించారు. బాబా దర్గాలో విశేష ప్రార్థనలు నిర్వహించి, భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ ఖాదరీ, సలాం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరుపుల వితరణ

లక్కవరపుకోట, జూలై 13(ఆంధ్రజ్యోతి): జమ్మాదేవిపేట వద్ద గల మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో ఉన్న విద్యార్థులకు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి దంపతులు వంద పరుపులు వితరణ చేశారు. రూ.లక్షా 30వేలు తమ సొంత నిధులను వెచ్చించి విద్యార్థులకు పరుపులు కొని అందించారు. ప్రిన్సిపాల్ యూవీకే పాత్రో నేతృత్వంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు వారికి ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ నాయకులు కరెడ్ల ఈశ్వరరావు, చొక్కాకుల మల్లునాయుడు, కొల్లు రమణమూర్తి, కొట్యాడ ఈశ్వరరావు, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

సభలు, ధర్నాలు నిషేధం

రేగిడి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి పోలీస్ సబ్ డివిజన్‌లో పోలీసు చట్టం సెక్షన్-30 అమలులో ఉన్నందున అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ధర్నాలు, ర్యాలీలు నిర్వహించరాదని రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని వర్గాలవారు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

రేపు 'జాతీయాలు- సామెతలు' పుస్తకావిష్కరణ

విజయనగరం కల్చరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గురజాడ కేంద్ర గ్రంథాలయంలో ఈనెల 15న సాయంత్రం 6 గంటలకు జాతీయ కవి గరిమెళ్ల సత్యనారాయణ జయంతిని పురస్కరించుకుని గరిమెళ్ల సత్యనారాయణ, కవిత జాతీయాలు-సామెతలు పుస్తకాల ఆవిష్కరణ సభ నిర్వహిస్తున్నట్టు అభ్యుదయ రచయితల సంఘం ఉపాధ్యక్షుడు జైపాల్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షుడిగా జీఎస్ చలం, గీతాలాపన డప్పు శ్రీను, పుస్తకావిష్కరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు నవరమ్మ చేస్తారని పేర్కొన్నారు. అదే విధంగా వల్లూరి శివప్రసాద్ పాల్గొంటారని తెలిపారు. రచయితలు, కవులు, సాహితీవేత్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ బదిలీ

విజయనగరం క్రైం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో సీఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎస్.శ్రీనివాస్‌ను శనివారం రాత్రి వీఆర్‌కు బదిలీ చేస్తూ విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ ఉత్తర్వులు విడుదల చేశారు. ఈయన వన్‌టౌన్ సీఐగా ఏడాదిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇటీవల తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న బంగారం పట్టుబడ్డ కేసు నమోదులో జాప్యం జరిగిన నేపథ్యంలో ఆకస్మిక బదిలీ చేశారు. ఈయన స్థానంలో విజయనగరం స్పెషల్ బ్రాంచ్‌లో సీఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆర్‌వీఆర్‌కే చౌదరిని వన్‌టౌన్ సీఐగా నియమిస్తూ డీఐజీ గోపీనాథ్ జెట్టీ ఉత్తర్వులు జారీ చేశారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

విజయనగరం కల్చరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రవణా నక్షత్ర సందర్భంగా శ్రీనివాసుని కల్యాణం వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు పి.నరసింహాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణాన్ని నిర్వహించి, అనంతరం హోమం నిర్వహించారు.

ప్రగతి లేని పైలెట్ గ్రామాలు

- అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ
- పూడుకుపోయిన కాలువలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు

గజపతినగరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏ గ్రామం చూసినా అధ్వానంగా దర్శనమిస్తోంది. కాలువలన్నీ పూడుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఎక్కడ వ్యాధుల భారిన పడతామేమోనని గ్రామీణులు భయాందోళన చెందుతున్నారు. బహిరంగ మలవిసర్జనపై ఎటువంటి చర్యలు లేవు. పలుచోట్ల చెత్త సంపద కేంద్రాలు అలంకారప్రాయంగా నిలిచాయి. మండలంలోని 30 పంచాయతీలు ఉండగా.. అందులో గజపతినగరం, పురిటిపెంట, పాతబగ్గాం మరుపల్లి, గుడివాడ, సీతారామపురం, కొత్తశ్రీరంగరాజపురం, దావాలపేట, పిడిశీల, సాలిపేట గ్రామాలను పారిశుధ్య మెరుగు కోసం పైలెట్ గ్రామాలుగా ఎంపిక చేశారు. ఈ గ్రామాల్లో తడి చెత్త, పొడి చెత్తలను వేరు చేసి డంపిగ్ యార్డులకు తరలించాల్సి



కెంగువ కాలువలో పేరుకుపోయిన చెత్త

ఉంది. ప్రతిరోజూ పారిశుధ్య పనులు చేపట్టి, ఆయా ఫొటోలను గ్రామ కార్యదర్శులు యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. కానీ ఆయా గ్రామాల్లో పారిశుధ్య పనులు మెరుగు పడడం లేదని మండలవాసులు గగ్గోలు పెడుతున్నారు. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన



కొత్తశ్రీరంగరాజపురం మురుగునీరు ఇలా..

గ్రామాల్లోనే పారిశుధ్య పనులు లోపిస్తే మిగిలిన గ్రామాల పరిస్థితి ఎలా ఉంటుందో అధికారులకే తెలియాలి.

చర్యలు చేపడతాం

గ్రామాల్లో ప్రతిరోజూ పారిశుధ్య పనులు చేపడుతున్నాం. గ్రామ కార్యదర్శుల పర్యవేక్షణ లోపిస్తే చర్యలు తీసుకుంటాం. చెత్తసంపద కేంద్రాలు వినియోగంలోకి తీసుకురావాలని ఇప్పటికే సూచించాం. పారిశుధ్య పనులు లోపించిన గ్రామాల్లో పర్యవేక్షణ చేపడతాం.

- సుగుణాకరరావు, ఈవోపీఆర్డీ, గజపతినగరం

కిత్తన్నపేటను అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే లలితకుమారి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

లక్కవరపుకోట, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీకి కంచుకోటలా నిలిచిన కిత్తన్నపేట గ్రామంలో ఎమ్మెల్యే లలితకుమారి ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటికి వెళ్లి వివరించారు. కిత్తన్నపేట గ్రామం టీడీపీకి కంచుకోటగా నిలిచి ప్రతి ఎన్నికలో భారీ మెజారిటీ ఇస్తోందని అన్నారు. గ్రామస్థులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, కొల్లు రమణమూర్తి, చొక్కాకుల మల్లునాయుడు, కొట్యాడ ఈశ్వరరావు, దుక్క వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

క్రియాశీలకంగా పని చేయాలి



మాట్లాడుతున్న జనసేన పార్టీ చీపురుపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి, జులై 13 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయిలో జనసైనికులు క్రియాశీలకంగా పని చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలో ఉన్న వారంతా నిరంతరం పార్టీ కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలన్నారు. గ్రామ పంచాయతీకి ముగ్గురు క్రియాశీలక సభ్యులు, ఒక వీర మహిళ వివరాలను పార్టీ కార్యాలయానికి అందజేయాలని కోరారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ గుర్ల మండల అధ్యక్షుడు యడ్ల సంతోష్, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి ధర్మాన్ని పాటిద్దాం

లక్కవరపుకోట, జూలై 13(ఆంధ్రజ్యోతి): జనసేన విస్తృత స్థాయి సమావేశం ఎల్.కోట మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. నియోజకవర్గ సమన్వయకర్త ఒబ్బిన సత్యనారాయణ ఆధ్వర్యంలో జనసేన నాయకులు, కార్యకర్తలు హాజరై భవిష్యత్ కార్యాచరణ రూపొందించారు. కూటమి ధర్మాన్ని పాటించి అందరూ ముందుకు వెళ్లాలని ఆయన కార్య కర్తలకు దిశా నిర్దేశం చేశారు. అందరికీ అం దుబాటులో ఉంటానని తెలిపారు. పార్టీ నాయకులు రావాడ నాయుడు, పులిబంటి సంతోష్, శివాజీ, నాగేష్ పాల్గొన్నారు.

విజయవంతంగా 'తొలి అడుగు'

- ఎంపీ కలిశెట్టి

విజయనగరం రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు విజయనగరం జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం విజయవంతంగా నడుస్తోందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు చెప్పారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల రోజులు పాటు జరగనున్న ఈ కార్యక్రమంలో ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన కార్యక్రమాలపై కరపత్రాల ద్వారా ప్రచార సభల ద్వారా వివరిస్తున్నామని చెప్పారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలు చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారన్నా



మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి

రు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వాటిని పార్టీ శ్రేణులు తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, గంటా పోలినాయుడు, ముద్దాడ చంద్రశేఖర్, పైడిరాజు, భరత్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల శ్రేయస్సే జనసేన లక్ష్యం

- నెల్లిమర్ల ఎమ్మెల్యే నాగమాధవి

భోగాపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): ప్రజల శ్రేయస్సే జనసేన పార్టీ లక్ష్యమని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. పూసపాటిరేగ మండలం సీహెచ్ అగ్రహారం గ్రామానికి చెందిన పలువురు ఆదివారం జనసేన పార్టీలో చేరారు. ముంజేరులోని జనసేన పార్టీ కార్యాలయంలో వీరికి ఎమ్మెల్యే కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. వార్డు మెంబరు జి.శ్రీనుతో సహా పలువురు జనసేనలో చేరిన వారిలో ఉన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

కంచరాంలో మట్టి వివాదం

రాజాం, జూలై 13(ఆంధ్రజ్యోతి): కంచరాం గ్రామంలోని ఎస్సీ కాలనీలో సిమెంట్ రోడ్డుపై బత్తిన రాము అనే వ్యక్తి మట్టి వేయడంతో విద్యార్థులు, గ్రామస్థులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గత కొన్ని రోజుల కిందట ఈ మట్టిని తొలగించాలని ఆయన్ని ఓ వ్యక్తి అడగగా.. మట్టిని తీయను ఎవడితో చెప్పుకుంటావో చెప్పుకో అని మొండిగా సమాధానం ఇచ్చాడు. దీంతో వివాదం తలెత్తింది. సర్పంచ్ ప్రతినిధి గెడ్డాపు అప్పలనాయుడు, గ్రామ పెద్దలు అక్కడకు చేరుకుని మట్టిని తొలగించాలని కోరారు. దీంతో రాము కొంత సమయం కావాలని కోరాడు. అందుకు గ్రామ పెద్దలు అంగీకరించారు. అయితే ఇచ్చిన గడువు దాటిపోయినా మట్టిని తొలగించలేదు. దీంతో ఎంపీడీవో



సిమెంట్ రోడ్డుపై మట్టి వేసిన దృశ్యం

వి.శ్రీనివాసరావు, తహసీల్దార్ ఎం.రాజశేఖర్‌కు కూడా గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో అధికారులు చర్యలు తీసుకుని, రోడ్డుకు అడ్డంగా వేసిన మట్టిని తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, కాలనీ వాసులు కోరుతున్నారు.

నగరంలో జీఆర్‌టీ జ్యూయలర్స్ ప్రారంభం

విజయనగరం రింగురోడ్డు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎంజీ రోడ్డు దాబా తోట వద్ద ఆదివారం జీఆర్‌టీ జ్యూయలరీ షాపును ఘనంగా ప్రారంభించారు. సంస్థ చైర్మన్ జి.రాజేంద్రన్ ముఖ్య అతిథిగా హాజరై ఈ షాపును ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 1964లో తమ జీఆర్‌టీ పేరున బంగారం వ్యాపారాన్ని ప్రారంభించామని, నేటికీ విజయనగరంలో 66వ షోరూం ప్రారంభించామని చెప్పారు. ఈ షోరూంలో బంగారం, వజ్రం, ప్లాటినం, వెండితో రత్న ఆభరణాలు అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. నాణ్యత, కళాత్మకత ప్రతిబింబించేలా షోరూంలో వస్తువులను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ప్రారంభ ఆఫర్‌లో గ్రాముకు రూ.150 తగ్గింపు, పాత బంగారు నాణాన్ని మార్పు చేసుకునే వినియోగదారులకు గ్రాముకు అదనంగా రూ.100 ప్రయోజనం కల్పిస్తున్నామన్నారు. వజ్ర ఆభరణాలపై క్యారెట్ విలువపై రూ.12,500 తగ్గింపు అందిస్తున్నామని, వెండి ఆభరణాలు ఎంఆర్‌పీపై పది శాతం డిస్కౌంట్‌ను అందిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో జీఆర్‌టీ జ్యూయలర్



విజయనగరంలో జీఆర్‌టీ షోరూం

ఎండీ జీఆర్ ఆనంద్, ఆనంత పద్మనాభన్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

కొండలు కరిగిపోతున్నాయి

- కంకర అక్రమంగా తరలించుకుపోతున్న వైనం

భోగాపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న చిన్న చిన్న కొండలను కొంతమంది అక్రమార్కులు పిండిచేసి, కంకరను తరలించుకుపోతున్నారు. మండలంలోని రావాడ, లింగాలవలస, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ సమీపంలోని కొండలను రాత్రి సమయాల్లో యంత్రాలతో దొలిచేసి, మట్టితో కూడిన కంకరను తరలించుకుపోతున్నారు. వీటి



రావాడ సమీపంలో అక్రమ తవ్వకాలకు గురైన కొండ

పరిమాణం రోజురోజుకు తగ్గిపోతున్నా అధికారులు కనీసం పట్టించుకోవడంలేదు.

వేంకటేశ్వరస్వామికి అభిషేకం

విజయనగరం కల్చరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దుప్పాడలో వెలసిన శ్రీక్షేత్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రవణా నక్షత్రం సందర్భంగా స్వామివారికి అభిషేకాలు జరిపి, ప్రత్యేకంగా అలంకరించారు. ఈ పూజల్లో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



స్వామివారికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

విజయవాడ కనకదుర్గమ్మకు ఆషాఢం సారె

పూసపాటిరేగ, జూలై 13(ఆంధ్రజ్యోతి): అఖిలాంధ్ర భవానీ దీక్షా సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతిఏటా ఆషాఢ మాసంలో విజయవాడ కనకదుర్గ అమ్మవారికి సారెను అందజేయటం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది ఉత్తరాంధ్ర భవానీలు, గురుభవానీలు ఆదివారం విజయవాడలో కనకదుర్గ అమ్మవారికి సారెను అందజేశారు. ఉత్తరాంధ్రకు చెందిన వీరు సుమారు 10బస్సులలో వెళ్లి అమ్మవారికి సంప్రదాయబద్ధంగా సారెను ఆ సేవా సంఘం అధ్యక్షుడు ముప్పిడి నారాయణరావు ఆధ్వర్యంలో సమర్పించారు. అక్కడి దేవదాయ సిబ్బంది వారిని సంప్రదాయబద్ధంగా ఆహ్వానించి సారెను అమ్మవారికి అప్పగించే విధంగా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో సేవా సంఘ సభ్యులు తిప్పాన సూరప్పడు, బొజ్జ విజయ్‌కుమార్, సంకాబత్తుల లక్ష్మణరావు, బర్రి చిన్నరావు, భక్తులు పాల్గొన్నారు.



సారె తీసుకువెళ్తున్న భవానీ దీక్షా సమితి సభ్యులు, భక్తులు

వాసవీ మాతకు..

శృంగవరపుకోట రూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం బొడ్డవర గ్రామానికి చెందిన వాసవీక్లబ్ ఆర్యవైశ్య మహిళలు వాసవీమాతకు సారె సమర్పించారు. సంఘ అధ్యక్షురాలు పూసర్ల కోటిరత్నం ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు చేశారు. అలాగే గ్రామదేవతలకు పూజలు నిర్వహించారు.



వాసవీమాతకు సారె సమర్పిస్తున్న మహిళలు

కొడుకుతో వెళుతూ.. కానరాని లోకాలకు

- గుర్తుతెలియని వాహనం ఢీకొని తండ్రి మృతి



ధర్మారావు (ఫైల్)

సాలూరు రూరల్, జూలై13 (ఆంధ్రజ్యోతి): కొడుకుతో పొలానికి స్కూటీపై వెళ్లిన తండ్రి.. రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైన ఘటన సాలూరు గొర్లెవీధిలో ఆదివారం చోటుచేసుకుంది. సాలూరు రూరల్ హెచ్‌సీ బంగారాజు తెలిపిన వివరాల ప్రకారం.. సాలూరు పట్టణం గొర్లె వీధికి చెందిన గొర్లె ధర్మారావు(43)కు సాలూరు బైపాస్ రోడ్డులో పొలం ఉంది. ఆదివారం ఆయన తన కొడుకు గుణశేఖర్(14)ను వెంట బెట్టుకుని స్కూటీపై పొలానికి వెళ్లారు. అక్కడ నుంచి తండ్రీ కొడుకులు బైపాస్ రోడ్డుపై జీగిరాం వైపు వెళ్తున్నారు. అదే సమయంలో స్కూటీని వెనుక నుంచి ఓ గుర్తు తెలియని వాహనం బలంగా ఢీ కొట్టింది. దీంతో ఇద్దరూ ఎగిరి పడ్డారు. స్కూటీని ఆ వాహనం కొద్ది దూరం ఈడ్చుకెళ్లింది. ఈ ఘటనలో ధర్మారావు తలకు తీవ్రమైన గాయం కావడంతో అక్కడిక్కడే మృతిచెందారు. గుణశేఖర్ గాయపడటంతో అతడిని తొలుత సాలూరు ఏరియా ఆసుపత్రికి, అక్కడ నుంచి విజయనగరంలో ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య అలివేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెచ్‌సీ తెలిపారు.

గూడ్స్ ఢీకొని వృద్ధుడి మృతి

దత్తిరాజేరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): గూడ్స్ ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. జీఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ బి.ఈశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాచిపెంటకు చెందిన దాసరి తవిటయ్య(70) మండలంలోని మరడాం గ్రామ సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా డౌన్‌లైను నుంచి వస్తున్న గూడ్స్ ఢీకొంది. దీంతో ఆయనకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని విజయనగరం జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ..

జామి, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని అలమండ-కంటకపల్లి రైల్వేస్టేషన్ పరిధిలో ఉన్న రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని మహిళ మృతి చెందింది. ఈ విషయంపై రైల్వే పోలీసులు ఆదివారం మాట్లాడుతూ మృతురాలు 40 ఏళ్ల లోపు వయస్సు కలిగి ఉండి, ఐదు అడుగుల పొడుగు ఉంటుందన్నారు. ఎరుపురంగు చాయతో ఉండి, ఆకుపచ్చ, ఆరంజ్ రంగులతో కూడిన నైటీ ధరించి ఉందని చెప్పారు. తెలిసినవారు 9490617089, 9182073593 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

బుచ్చెంపేటలో కొట్లాట

- పదిమందికి గాయాలు ● ఇద్దరి పరిస్థితి విషమం

రాజాం రూరల్, జులై 13 (ఆంధ్రజ్యోతి): రాజాం మున్సిపాలిటీ పరిధిలోని బుచ్చెంపేటలో ఆదివారం రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన కొట్లాటలో పదిమంది గాయపడ్డారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఇద్దరు రాజాంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా మరో ఐదుగురు రాజాం సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాల్లోకి వెళితే.. ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇరువర్గాల మధ్య స్థలం విషయంలో ఆదివారం ఉదయం వివాదం చెలరేగింది. రాత్రి వరకూ పెద్దల సమక్షంలో చర్చలు జరిగాయి. అయితే సమస్య పరిష్కారం కాకపోవడంతో ఇరువర్గాలు కొట్లాటకు దిగారు. పిట్టా రాము, సత్యం, ముద్దన సూరిబాబు, పిట్టా రాజేంద్ర తదితరులంతా గాయపడిన వారిలో ఉన్నారు. రాజాం పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం బుచ్చెంపేటలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం

విజయనగరం క్రైం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): విజయనగరం రైల్వే స్టేషన్ కోరుకొండ రైల్వేస్టేషన్ సమీపంలోని జొన్నవలస రైల్వేగేటు వద్ద ఉన్న రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్టు జీఆర్‌పీ హెచ్‌సీ కృష్ణారావు ఆదివారం తెలిపారు. మృతుని వయస్సు 25 నుంచి 30 మధ్యలో ఉండొచ్చని చెప్పారు. మృతదేహం ఒంటిపై ముదురు నీలం రంగు నైట్ ప్యాంటు, బిస్కెట్ కలర్ రౌండ్ నెక్ టీ షర్ట్ ఉందని తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు 94410 13330, 0891-2883218 నెంబర్లను సంప్రదించాలన్నారు.

వరకట్న వేధింపుపై కేసు నమోదు

భోగాపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపులపై రాజాపులోవ గ్రామానికి చెందిన ఎం.మోహన్‌ప్రియ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం రాత్రి కేసు నమోదు చేశామని ఎస్ఐ పి.సూర్యకుమారి తెలిపారు. రాజాపులోవ గ్రామానికి చెందిన ఎం.మోహనప్రియకు, విశాఖ జిల్లా తగరపువలసకు చెందిన ఎర్ని వెంకటేష్‌కు 2020లో వివాహం జరిగింది. అప్పట్లో కట్నం అందజేశామని, మళ్లీ ప్రస్తుతం కట్నం తీసుకు రావాలని భర్తతో పాటు మామ, అత్త, ఆడపడుచు వేధిస్తున్నారని మోహన్‌ప్రియ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన లారీ

రేగిడి, జూలై 13 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని కోడిశ, జోడబందల సెంటర్ మధ్య మార్గంలో ఆదివారం భారీ ప్రమాదం తప్పింది. వంగర నుంచి రాజాం వైపు వస్తున్న ఊక లారీ, ఎదురు గా వస్తున్న బస్సును తప్పించిబోయి పొలాల్లోకి దూసుకెళ్లింది. అక్కడే విద్యుత్ స్తంభాలు ఉండగా.. డ్రైవర్, క్లీనర్ ఎటువంటి అపాయం లేకుండా బయటపడ్డారు. డ్రైవర్‌కు ఫిట్స్ రావటంతో స్టీరింగ్ పక్కకు తిప్పడంతో ఈ ఘటనకు దారి తీసినట్లు చెబుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ

భోగాపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిగాం, లక్ష్మీపురం గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురైనట్టు శనివారం రాత్రి రెండు కేసులు నమోదయ్యాయని స్థానిక హెచ్‌సీ తిరుపతిరావు తెలిపారు. ఆయన ఆదివారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ లక్ష్మీపురంలో ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైనట్టు ఎం.వేణుగోపాల్, నందిగాంలో ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైనట్టు గురపురెడ్డి కన్నయ్య వేర్వేరుగా ఫిర్యాదు చేశారని చెప్పారు. ఈ మేరకు కేసులు నమోదు చేశామన్నారు.

లారీ డ్రైవర్లపై కేసు నమోదు

భోగాపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): భోగాపురం జాతీయ రహదారిపై ప్రమాదకరంగా డ్రైవింగ్ చేస్తున్న రెండు ట్రక్ లారీ డ్రైవర్లపై కేసులు నమోదు చేసి, అపరాధ రుసుం వసూలు చేశామని ఎస్ఐ వి.పాపారావు ఆదివారం తెలిపారు. వాహన తనిఖీల్లో భాగంగా అధిక కాంక్రీట్ పిక్కల లోడుతో వెళ్తున్న రెండు ట్రక్ లారీలను పట్టుకుని, కేసులు నమోదు చేశామని చెప్పారు. ఈ లారీల నుంచి రోడ్డుపై రాళ్లపిక్కలు పడడంతో రూ.1600 అపరాధ రుసుం వసూలు చేశామని తెలిపారు.

'జిందాల్' మోసాలపై దర్యాప్తు చేపట్టండి

శృంగవరపుకోట రూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని జిందాల్ పరిశ్రమ పేరుతో 2008 నుంచి కొందరు దళారీలు నిర్వాసితులను పలు రకాలుగా దోచుకున్నారని, వాటిపై కలెక్టర్ విచారణ చేసి, నిజాలు నిగ్గుతేల్చాలని సీపీఎం జిల్లా నాయకుడు చల్లా జగన్ కోరారు. ఆదివారం బొడ్డవర గ్రామం వద్ద జిందాల్ నిర్వాసితులతో కలిసి ఆయన నిరసన చేపట్టారు.

ఇసుక అక్రమ నిల్వలు

భోగాపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): లింగాలవలస సమీప జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి వెళ్లే సమీపంలో ఇసుక అక్రమ నిల్వలు దర్శనమిస్తున్నాయి. రాత్రి సమయాల్లో ఇసుకను అక్రమంగా తీసుకొచ్చి, ఇక్కడ డంప్ చేస్తున్నారు. ఇక్కడ నుంచి లారీలతో ఇతర జిల్లాలకు తరలిస్తున్నారు. దీనిపై అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.



లింగాలవలస సమీపంలో ఇసుక నిల్వలు

ఏజెన్సీలో మూగ వేదన!

(ఐదో పేజీ తరువాయి)

పూర్తిస్థాయిలో పశువైద్యులు లేకపోవడంతో పాడి రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. సకాలంలో వైద్యం అందని కారణంగా కొన్ని పశువులు మృత్యువాత పడుతున్నాయి. దీనిపై కూటమి ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గిరిజన రైతులు కోరుతున్నారు.

వేధిస్తున్న వసతి సమస్య..

జిల్లాలో పశువైద్య కేంద్రాలకు పక్కా భవనాలు లేవు. దీంతో కొన్నాళ్లుగా వసతి సమస్య వేధిస్తోంది. కొన్ని భవనాలు శిథిలావస్థలో ఉంటే... మరికొన్ని చోట్ల అద్దె భవనాల్లో ఈ పశువైద్య శాలలను నిర్వహిస్తున్నారు. పొల్ల, దోనిబాయి, చినబగ్గలో పశువైద్యశాలలకు పక్కా భవనాలు లేవు. అక్కడ రైతుసేవా కేంద్రంలోనే మూగజీవాలకు వైద్యసేవలు అందిస్తున్నారు. భామిని, బత్తిలిలో శిథిలావస్థకు చేరిన భవనాలకు అప్పుడప్పుడు చిన్నపాటి మరమ్మతులు చేపట్టి వినియోగిస్తున్నారు.

జేడీ ఏమన్నారంటే...

'పశు వైద్య శాఖలో చాలావరకు పోస్టులు భర్తీ కావాల్సి ఉంది. దీనిపై ప్రభుత్వానికి నివేదిక పంపించాం. సీతంపేటలోని పశువైద్య కేంద్రంలోని డీఈవో పోస్టు జిల్లా విభజనలో శ్రీకాకుళం తరలిపోయింది. జీతం మాత్రం ఇక్కడే చెల్లిస్తున్నారు. ఈ విషయాన్ని కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.' అని జేడీ మన్మథరావు తెలిపారు.

అక్విడక్టులు ఇలా.. సాగునీరు ఎలా?

(ఐదో పేజీ తరువాయి)

తొలగించాల్సి ఉంది. ఈ నెల 10న జంఝావతి ప్రాజెక్టు పరిధిలోని రబ్బరుడ్యాం నుంచి సాగునీరు విడుదల చేశారు. కాలువలో పిచ్చి మొక్కలు, గుర్రపు డెక్క పేరుకుపోవడంతో శివారు ప్రాంతాలకు సాగునీరు సక్రమంగా అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి ఉల్లిభద్ర ప్రాంతంలోని అక్విడక్టులతో పాటు కాలువలను బాగుచేయాలని రైతులు కోరుతున్నారు.

బ్యాటరీ సైకిల్ రూపకర్తకు అభినందనలు



సిద్దుతో బ్యాటరీ సైకిల్‌పై ఎక్కి ప్రయాణిస్తున్న బేబీనాయన

బొబ్బిలి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తెర్లాం మండలంలోని జాడవారి కొత్తవలసకు చెందిన రాజాపు సిద్దు ఇటీవల తక్కువ ఖర్చుతో బ్యా టరీ సైకిల్‌ను రూపకల్పన చేయడంతో ఎమ్మెల్యే బేబీనాయన అభినందించారు. ఆదివారం బొబ్బిలి కోటలోని క్యాంప్ కార్యాలయంలో సత్కరించారు. ఆలోచనలకు మరింత పదును పెట్టి, ఉన్నత స్థాయికి వెళ్లాలని బేబీనాయన ప్రశంసించా రు.కొంత ఆర్థిక సహాయం చేశారు. వ్యవసాయ ఆధారిత తమ గ్రామంలో చెరువు నీటితో 40 ఎకరాలు రైతులు సాగుచేసుకుంటున్నారని, రెండు బోరు బావులను నిర్మించి సోలార్ ద్వారా విద్యుత్ సదుపాయం కల్పించాలని సిద్దు కోరాడు. అనంతరం సిద్దు సైకిల్‌పై బేబీనాయన కూర్చొని ప్రయాణం చేశారు. కార్యక్రమంలో నేతేటి రామారావు పాల్గొన్నారు.

హామీలను అమలు చేస్తాం

బొబ్బిలి రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయనఅన్నారు. ఆదివారం మండలంలోని కింతలివానిపేటలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పింఛన్లు నిర్ణీత సమయంలో అందజేస్తున్నామని, తల్లికి వందనం ఎంతమంది ఉంటే అంత మందికి ఇచ్చామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు వాసిరెడ్డి సత్యనారాయణ, దిబ్బగుడ్డివలస ఎంపీటీసీ వెన్నెల నాగరాజు, నాయకులు కె. రాము, బొంతలకోటి గోపి, టి.రామారావు, బి.నాగరాజు, యామల గోపి, బి.సింహాచలం, టి.రంగారావు, కృష్ణంరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

●తెర్లాం: తెర్లాంలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ వెంకట నాయుడు, నర్సుపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎండిపోతున్న వరి నారుమడులు



కోమటిపల్లిలో ఎండిపోతున్న వరి నారు

బొబ్బిలి రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమటిపల్లి, గున్నతోటవలస, ఎం.బూర్జవలస, పిరిడి తదితర గ్రామాల్లో వర్షాలులేక, కాలువ ద్వారా నీరు రాకపోవడంతో నారుమళ్లు, ఎదలు, మొక్కజొన్న పైరు ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పది రోజు ల కిందట నైరుతి రుతుపవనాల ప్రభావంతో అడపాదడపా వర్షాలు కుర వడంతో రైతులు విత్తనాలు చల్లారు. తర్వాత వర్షాలు ముఖం చాటేయ డం, పగటిపూట ఉష్ణోగతలు 35 డిగ్రీలు దాటి నమోదవుతుండడంతో మొలిచిన నారు ఎండిపోతోంది. కొన్నిచోట్ల నారుమళ్లు నెర్రలిచ్చాయి. ఈ ఏడాది బొబ్బిలిమండలంలో ఖరీఫ్‌లో 6,850 ఎకరాలు వరిసాగుచేయను న్నట్లు చెబుతున్నారు.ఇందులో 70 వర్షాధార భూముల్లో 30 శాతం వర కూ ఎదలు చల్లారు. వీఆర్ఎస్ కాలువల పరిధిలో ఆయకట్టు రైతులు దమ్ము చేసేందుకు నారు చల్లారు.వీఆర్ఎస్ కాలువల్లో పూడిక తొలగించి నా నీరు విడుదలచేయకపోవడంతో నారుమళ్లు తడుపుకోలేకపోతున్నా మని రైతులు వాపోతున్నారు. మెట్ట ప్రాంతాల్లో వేసిన మొక్కజొన్న పైరు సైతం ఎండిపోతోంది. తక్షణమే నీరు విడుదలచేసి నారుమళ్లు, ఎదలను రక్షించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

గడిగెడ్డ కాలువల్లో పిచ్చిమొక్కలు

గుర్ల, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పీఆర్‌పేట, గోషాడ, గూడెం తదితర గ్రామాల్లోని గడిగెడ్డ రిజర్వాయర్ ఎడమ కాలువ పరిధి లోని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాలువలో పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు పెరగడంతో నీరు ముందుకు వెళ్లే అవకాశంలేదని రైతులు చెబుతున్నారు. సమీపంలో కొండవాగుల నుంచి వర్షాకాలంలో గడిగెడ్డ రిజర్వాయర్‌లోకి నీరుచేరుతోంది. ఎడమకాలువ పరిధిలో 1300 ఎకరాలకు నీరందాల్సి ఉంది. అయితే కొద్దేళ్లుగా కాలువల నిర్వహణ, మరమ్మతులు లేకపోవడంతో ఖరీఫ్‌లో సైతం ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో క్రమేణా రిజర్వాయర్‌లోకి నీరుచేరుతోంది.దీనికితోడు ఎదలు వేయడంతోపాటు నారుపోశారు. ఈ నేపథ్యంలో కాలువల ద్వారా ఖరీఫ్‌లో సాగుకు నీటిని విడుదలచేసినా పిచ్చిమొక్కలు పెరగడంతో ఆయకట్టుకు అందేఅవకాశం ఉండదని రైతులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి కాలువల్లో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

శిథిలావస్థలో సంధి గెడ్డ చెక్‌డ్యామ్

మక్కువ రూరల్, జూలై13 (ఆంధ్రజ్యోతి): మండంగి గ్రామం వద్ద సంధి గెడ్డపై చెక్ డ్యామ్ శిథిలావస్థకు చేరింది. దీంతో రైతులు సాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. మెండంగి, ఆలగురువు గ్రామాల రైతుల సాగుకు గెడ్డ నీరే ఆధారం. సుమారు 15 ఏళ్ల కిందట నిర్మించిన ఈ చెక్ డ్యామ్ ప్రధాన వాల్ భూమిలో కలిసిపోయి నీరు నిల్వ ఉండట్లేదు. దీనివల్ల పంట పొలాలకు సాగునీరు ఆశించిన మేర నీరు అందడం లేదని రైతులు తెలిపారు. పొలాలకు నీరు అందించే కాలువ కూడా పాడైంది. మెండంగి, ఆలగురువు గ్రామాలకు చెందిన సుమారు 60 ఎకరాల ఆయకట్టుకు ఇదే ఆధారం. పాత చెక్‌డ్యామ్ శిథిలావస్థకు చేరుకోవడంతో చెక్ డ్యామ్‌పై మట్టిపోసి రైతులు నీటిని నిల్వ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మెండంగి వద్ద కొత్తగా నిర్మాణం చేపట్టాలని స్థానిక రైతులు కోరారు.



చెక్‌డ్యామ్‌పై మట్టిపోసి నీటిని నిల్వ చేసిన రైతులు

పేదల సంక్షేమమే ధ్యేయం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, జూలై13 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని చెముడుగూడ, అడ్డంగూడ, తాటిశీల గ్రామాల్లో ఆదివారం మండల పార్టీ అధ్యక్షుడు అడ్డాకుల నరేష్ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో జరిగిన మంచిని వివరించారు. అందుకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రజలు అష్టకష్టాలు పడ్డారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతుందన్నారు. పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్, తల్లికి వందనం వంటి పథకాలు ఇవ్వడంతో పాటు ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్య, అన్నదాత సుఖీభవ పథకాన్ని త్వరలో అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ కద్రక కళావతి, మాజీ సర్పంచ్ రామారావు, కొండలరావు, భాస్కరరావు, సదానంద్, రవి, శ్రీను, ఈశ్వర్, మంగయ్య, ప్రకాశ్ పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు రూ.57 వేల సాయం

గరుగుబిల్లి, జూలై13 (ఆంధ్రజ్యోతి):అనారోగ్యానికి గురైన రావుపల్లి గ్రామానికి చెందిన గడిదేసి రాంబాబుకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.57 వేలను జనసేన తరఫున ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. కొన్నాళ్లుగా రాంబాబు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. మెరుగైన సేవలు పొందలేని స్థితిలో ఉన్నాడు. సమస్యను జనసేన పార్టీ అధ్యక్షుడు బోను శివ గుర్తించారు. పలువురి దృష్టికి తీసుకువెళ్లి రూ. 57 వేలు సేకరించారు. ఆ మొత్తాన్ని ఆదివారం కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కద్రక మల్లేశ్ చేతుల మీదుగా రాంబాబు కుటుంబ సభ్యులకు అంద జేశారు. ఈ సందర్భంగాప్రభుత్వ విప్ జగదీశ్వరి మాట్లాడుతూ రాం బాబుకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి అవసరమైన మొత్తాన్ని మం జూరు చేసేందుకు అవసరమైన చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు.

ఐకమత్యమే మన బలం



యశస్వినికి స్వాగతం పలుకుతున్న సంఘ సభ్యులు.

పార్వతీపురం టౌన్, జూలై13 (ఆంధ్రజ్యోతి): ఐకమత్యమే మన బలమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని తూర్పుకాపు అభివృద్ధి, సంక్షేమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్విని అన్నారు. ఆదివారం మన్యం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో తూర్పుకాపు జిల్లా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ కలియిక నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి 13 జిల్లాల్లో ఉన్న కాపుల ఐక్యత కోసం, వారి సంక్షేమ కోసం అహర్నిశలు శ్రమించడం జరుగుతోందన్నారు. ఆర్థికంగా వెనుకబాటుతనంలో ఉన్న కాపుల విద్య, ఉపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయడమే నా బాధ్యత అన్నారు. విద్య, రాజకీయ రిజర్వేషన్లలో సముచిత స్థానం కల్పించాలని ఇప్పటికే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లను కోరానన్నారు. నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. అనంతరం తూర్పుకాపు సంక్షేమ సంఘ ప్రతినిధులు ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో తూర్పుకాపు సామాజికవర్గ నాయకులు బాబు పాలూరు, బి.సీతారాం, ఉదయ్‌శేఖర్ పాత్రుడు, అనిల్‌కుమార్, విజయాంకుశం, ఆర్.రాంబాబు, జి.చంటి తదితరులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీ

కొమరాడ, జూలై13 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం ఎదురుచూసే రైతులు కొంత ఉపశమనం పొందారు. మండలంలోని చోళ్లపదం రైతు సేవా కేంద్రంలో ఆదివారం రైతులకు వ్యవసాయాధికారి సీహెచ్.ప్రసాద్ యూరియా పంపిణీ చేశారు. మరో రెండు రోజుల్లో మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉంటుందని ఏవో తెలిపారు.

యువకుల రక్తదానం

జామి, జూలై 13 (ఆంధ్రజ్యోతి):కుమారాం గ్రామానికి చెందిన 20 మంది యువకులు తలసేమియా వ్యాధితో బాధపడుతున్న వారి కోసం ఆదివారం రక్తదానం చేశారు. ఈ మేరకు తలసేమియా రోగులకోసం ప్రత్యేకంగా పనిచేస్తున్న న్యూలైఫ్ బ్లడ్ సెంటర్ డాక్టర్ల బృందం రక్తం సేకరించింది. వారి కోసం భవిష్యత్‌లో మరింతగా రక్తదానం చేసేందుకు సిద్ధమవుతున్నట్లు యువకులు తెలిపారు. రక్తదానం చేసిన యువకులను గ్రామపెద్దలు అభినందించారు.

గొట్ట మంగళాపురంలో తొలి అడుగు

పాలకొండ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్టమంగళాపురంలో మండల పార్టీ అధ్యక్షుడు గండి రామినాయుడు సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. సర్పంచ్ బెజ్జిపురం వరహాలనాయుడు, పొట్నూరు వరహాలనాయుడు, బెవర శ్రీను, వన్నల రమేష్, బొద్దాన గణపతి తదితరులు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలన జరిగిన మంచిని వివరించారు. సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు.

బల్లంకిలో పశువులమ్మ తల్లి పండుగ

వేపాడ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బల్లంకిలో ఆదివారం పశువులమ్మతల్లి పండుగను ఘనంగా నిర్వహించారు. ఏటా వరినాట్లు ప్రారంభమయ్యే సమయంలో ఈపండుగను ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు. గ్రామస్థులు డప్పువాయిద్యాలు, బ్యాండు మేళాలతో అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా వెళ్లారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

కూటమితో సుపరిపాలన సాధ్యం



పథకాలను వివరిస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, జూలై13 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలన కూటమితో సాధ్యమని మహిళా, స్త్రీ శిశు సంక్షేమ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పట్టణంలోని 2, 5 వార్డుల్లో ఆదివారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు ఆమెకు హారతులు పట్టి పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమంపై కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైసీపీ నేతలు అడ్డంకులు సృష్టించడం వల్ల మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థిని గెలిపించాలన్నారు. టీడీపీ అభ్యర్థి గెలిస్తే మున్సిపాలిటీలో అభివృద్ధి పనులను పునః ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నిమ్మాది చిట్టి, రెండో వార్డు ఇన్‌చార్జి పప్పల మోహనరావు, ఐదో వార్డు ఇన్‌చార్జి నిమ్మకాయల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాలను అభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో గిరిజన జేఏసీ నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని గిరిజన గ్రామాల్లో గత ప్రభుత్వం జీవో నెంబర్-3ను కాలయాపన చేసిందన్నారు. గిరిజన గ్రామాల అభివృద్ధి అంతంత మాత్రమే జరిగిందన్నారు. గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని, విడతల వారీగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జేఏసీలు ఒకే తాటిపై నడిస్తే గిరిజన గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గిరిజనులు పేదరికంలో ఉన్నారని, వారు పండించిన పంటలకు గిట్టుబాటు ధర వచ్చేలా కృషి చేస్తానన్నారు. వచ్చే ఆదివాసీ దినోత్సవాన్ని మనమే జరుపుదామని, సంప్రదాయబద్ధంగా మన ఫొటోలు మనమే ముద్రించుకుందామన్నారు. సమావేశంలో గిరిజన జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

ఓర్వలేకే తప్పుడు ఆరోపణలు



మాట్లాడుతున్న మధుసూదనరావు

గరుగుబిల్లి, జూలై13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే మాజీ మంత్రి పాముల పుష్పశ్రీవాణి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ అక్కేన మధుసూదనరావు అన్నారు. ఆదివారం ఖడ్గవలస సముదాయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాది పాలనలో ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి పలు అభివృద్ధి పనులకు ప్రత్యేక చొరవ చూపారన్నారు. ఉప ముఖ్యమంత్రి పదవిని సొంత ప్రయోజనాలకే ఆమె ఉపయోగించుకున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం, కురుపాం ఎమ్మెల్యేపైన తప్పుడు ఆరోపణలు చేస్తే తగిన శాస్తి తప్పదన్నారు. సినిమా డైలాగులు మాని ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలన్నారు. నియోజకవర్గంలో ఎవరు అభివృద్ధి చేశారో, చేయలేదోనన్న విషయం ప్రజలకు తెలుసునన్నారు. సమావేశంలో సంతోషపురం సర్పంచ్ ఎ.రాంబాబు, ఏఎంసీ డైరెక్టర్ అంబటి రామకృష్ణ ఉన్నారు.

ప్రధానోపాధ్యాయులకు శిక్షణ

సీతానగరం, జూలై13 (ఆంధ్రజ్యోతి): పాఠశాల అభివృద్ధిపై జిల్లాలోని 250 మంది ప్రధానోపాధ్యాయులకు మరిపివలసలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నుంచిశిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నామని కోర్స్ జిల్లా డైరెక్టర్ ఎం.వెంకటరమణ తెలిపారు. ఆదివారం ఆయన సీతానడరంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో మొదటి విడతగా పాఠశాల లీడర్ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమాన్ని గురువారం వరకు నిర్వహిస్తామన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

కొమరాడ,జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సివిని గ్రామంలో ఆదివారం మహిళ కోసం కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆర్ఎస్ రోయల్ అకాడమీ ప్రారంభించింది. గ్రామీణ ప్రాంతాల్లో బడుగుబలహీన వర్గాల మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యమని సంస్థ నిర్వాహకురాలు రేణుక తెలిపారు. కుట్టు శిక్షణతో పాటు బ్యూటీషన్, ఎంబ్రాయిడింగ్, అల్లికల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నామన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కళింగ మల్లిబాబు,పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

'కోట' మృతి సినీ పరిశ్రమకు తీరని లోటు

గరుగుబిల్లి, జూలై13 (ఆంధ్రజ్యోతి): విలక్షణమైన నటుడు కోట శ్రీనివాసరావు మృతి తెలుగు సినీ పరిశ్రమకు తీరని లోటు అని నాగూరు గ్రామానికి చెందిన నఖ చిత్రకారుడు పల్ల పరిశినాయుడు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1994లో ఢిల్లీ తెలుగు అకాడమీ అవార్డులు అందిస్తున్న సమయంలో శ్రీనివాసరావును కలిశానన్నారు. సినీ పరిశ్రమకు సంబంధించి కోటను ఎంపిక చేయగా చిత్రకారులకు సంబంధించి తనను ఎంపిక చేశారన్నారు. ఆ సమయంలో కోట శ్రీనివాసరావును కలిసి మాట్లాడానన్నారు. తెలుగు పరిశ్రమలో మరువలేని నటుడు అన్నారు. ఈ సందర్భంగా కోట మృతికి సంతాపం తెలిపారు.

కార్మిక సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న రమణారావు

పాలకొండ, జూలై13 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కార్మిక సంఘ నగర పంచాయతీ గౌరవాధ్యక్షుడు దావాల రమణారావు డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం ఇంజనీరింగ్ విభాగ కార్మికులు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని పాలకులు చెప్పినప్పటికీ నేటికీ పరిష్కారం చేయలేదన్నారు. చర్చల పేరిటపది నెలలుగా కాలయాపన చేస్తున్నారన్నారు. షరతులు లేకుండా కార్మికులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. జీవో 36 ప్రకారం జీతాలు చెల్లించాలని, పెంపు కేటగిరీ నిర్ణయం విషయలో కూడా జరిగిన పొరపాట్లు సరిదిద్దామన్నారు. కార్యక్రమంలో వై.హరిబాబు, ఎస్.బాబూరావు, పి.రమేశ్, ఐ.రాజు, కె.రాజేశ్, నరసింగరావు, రాము, సంజీవి, వేణు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధి చేపట్టండి

పాలకొండ, జూలై13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సమగ్ర అభివృద్ధి చేపట్టాలని సీపీ నాయకులు కోరారు. పాలకొండలో ఆగస్టు 8, 9 తేదీల్లో నిర్వహించనున్న సీపీఐ పార్వతీపురం మన్యం జిల్లా ద్వితీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం పట్టణంలో జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు, పార్టీ సీనియర్ నాయకుడు నెల్లి సత్యనారాయణ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాసభలకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ మూర్తి, జిల్లా నిర్మాణ బాధ్యుడు గుజ్జల ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు హాజరవుతారని తెలిపారు.సీపీఐ పేదల అభ్యున్నతి కోసం పనిచేసిన పార్టీ అన్నారు. కార్యక్రమంలో న్యాయవాది ఉత్తరావల్లి మురళీ మోహన్, జిల్లా సమితి సభ్యుడు బుడితి అప్పలనాయుడు, కార్యవర్గ సభ్యుడు కూరంగి గోపి తదితరులున్నారు.

ఏకగ్రీవంగా ఉద్యోగ సంఘ ఎన్నికలు



ఎన్నికైన నూతన కార్యవర్గం

పార్వతీపురం రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం తాలూకా యూనిట్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు ఆదివారం ఏకగ్రీవంగా జరిగాయి. ఎన్నికల అధికారి ఎ.రమణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చింతల మురళీ, విజయనగరం ఉమ్మడి జిల్లా ఏపీ ఎన్‌జీవో ప్రధాన కార్యదర్శి ఆవు సురేష్, పార్వతీపురం మన్యం జిల్లా ఏపీ ఎన్‌జీవో అధ్యక్షుడు జి.వి.ఆర్.ఎస్.కిశోర్ పాల్గొన్నారు. సంఘ అధ్యక్షుడిగా ఎస్.అర్జునరావు, కార్యదర్శిగా ఎం.శ్రీరాములు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వైద్య ప్రకాశ్, వైస్ ప్రెసిడెంట్‌గా జి.ఫల్గుణ, ట్రెజరర్‌గా ఎస్.సంతోష్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా మాలతి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్.చంద్రమౌళి, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా వసంత్, రమేష్ పాత్రుడులను ఎన్నుకున్నారు.

కొండచిలువ హతం



మక్కువ, జూలై13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్‌సీఎం వీధిలో ఆదివారం సుమారు పది అడుగుల కొండచిలువను స్థానికులు హతం చేశారు. రోడుపైకి కొండచిలువ రావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అప్రమత్తమమైన స్థానికులు దాన్ని చంపేశారు. దాంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.

ఎంఈవోల బదిలీలు చేపట్టండి

గుమ్మలక్ష్మీపురం, జూలై13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మండల విద్యా శాఖాధికారి-1లకు తక్షణమే బదిలీలు చేపట్టాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు లేఖ పంపించినట్టు ఎంఈవో-1 అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంఈవో-1లకు ఎనిమిదేళ్లుగా బదిలీలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాస్తవానికి ఐదేళ్ల ఒకేచోట పనిచేసిన అధికారులకు తప్పనిసరిగా బదిలీలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. అన్నిశాఖల్లో బదిలీలు నిర్వహించిన ప్రభుత్వం ఎంఈవోలకు మాత్రం ఇంతవరకు చేపట్టలేదన్నారు. ఈ విషయంలో చొరవ తీసుకుని న్యాయం చేయాలని లోకేశ్‌ను కోరానని సామల తెలిపారు.

నేడు ఐటీడీఏలో పీజీఆర్ఎస్

సీతంపేట రూరల్, జూలై13 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తామని ఐటీడీఏ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. పీజీఆర్ఎస్‌కు ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డితో పాటు పలు శాఖలకు చెందిన అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. పలు సమస్యల పరిష్కారం కోసం గిరిజనులు పీజీఆర్ఎస్‌ను ఆశ్రయించవచ్చునని పేర్కొన్నారు.

జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రంజిత్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం, జూలై13 (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పి.రంజిత్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జూలై 12, 13 తేదీల్లో కడప జిల్లా కేంద్రంలో జనవిజ్ఞాన వేదిక 18వ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ పార్వతీపురం మన్యంలో జన విజ్ఞాన వేదిక కార్యకలాపాలను విస్తృతం చేస్తామన్నారు.

విజయమే లక్ష్యంగా పనిచేయండి

మక్కువ, జూలై13 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో వైసీపీ విజయమే లక్ష్యంగా కార్యకర్తలంతా పనిచేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర పిలుపునిచ్చారు.ఆదివారం స్థానిక పద్మశ్రీ థియేటర్ ఆవరణలో మండల స్థాయి విస్తృత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి టీడీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. వైసీపీ హయాంలో ప్రజలకు పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అందించామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు, మండలపార్టీ అధ్యక్షుడు మావుడి రంగునాయుడు, నాయకులు దండి శ్రీనివాసరావు, పెంట సంజీవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా గ్రంథాలయ ప్రాంగణం



మరుగుదొడ్ల చుట్టూ పిచ్చిమొక్కలు

వీరఘట్టం, జూలై13 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కార్యాలయం వెనుకనున్న గ్రంథాలయ ప్రాంగణం అధ్వానంగా ఉంది. పిచ్చిమొక్కలు, బురదతో పాఠకులు ఇబ్బంది పడుతున్నారు. చాన్నాళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా పట్టించుకునే నాథులే కరువయ్యారు. ఇకనైనా పాలకులు స్పందించి మరుగుదొడ్ల చుట్టు ఉన్న పిచ్చిమొక్కలు తొలగించడంతో పాటు గ్రంథాలయానికి వెళ్లే దారిని బాగుచేయాలని పాఠకులు కోరారు.



గ్రంథాలయానికి వెళ్లే దారి ఇలా..